

# వత్తుపాడుగారబ్బాడు
తమ్మిరెడ్డి

మారేడుమిల్లి అవతలున్న పాములేరు దాటితే కనపడే బీరంపిల్లి వెళ్ళిన పులగం గోపాళం అక్కడ మన్యపోళ్ళ దగ్గర భూతవైద్యం నేర్చుకునొచ్చేడు. ఊళ్ళోకి దిగీ దిగంగానే వాళ్ళ దొడ్లో తియ్యటి కాయలు గాసే నారింజచెట్టుకి పెట్టేడట మందు. మాంచి కాపుమీదున్న ఆ చెట్టు మూడ్నెల్లు తిరక్కుండానే చచ్చిపోయింది. "మన వైజ్జిగం మనుషుల మీదెలా పనిజేస్తదా... ఎవళ్ళ మీద పెడదామా" అని ఆలోచించి చివరికి ఎవరూ దొరక్క వాళ్ళ చంటిపిల్ల మీద పెట్టేడట. ఆ పిల్లకూడా మూడు నెల్లు తిరక్కుండా చచ్చిపోయింది.

ఈ విషయం వాళ్ళింటి సందు చివర్లో ఉండే బోదకాలు సుబ్బయ్యమ్మ నోటమ్మట వూరు మొత్తం పాకిపోయింది. గోపాలం దగ్గర భూతవైద్యం చేయించుకోడానికి జనం రాడం మొదలెట్టేరు. కొన్నాళ్ళకి ఎడ్లబళ్ళమీదా, పాసింజరు పడవలమీదా దిగిపోడం మొదలెట్టేరు జనం. పురాతన భూతవైద్యానికి చాలా పేరెల్లిన రాజానగరం అవతలున్న వడిశలేరు భూతవైద్యులు ఇంకా లక్ష్మీనర్సాపురం, లొల్ల లాంటి ఊళ్ళలో ఉండే భూతవైద్యులు కూడా గోపాళంతో మాటాడ్డానికొస్తున్నారు.

పూర్వం పులగం గోపాళం అని పిలిచే జనం ఇప్పుడు భూతాలగోపాళం అని పిలుస్తున్నారు.



ఆముదం పెట్టి వెనక్కి దువ్విన జులపాల జుట్టు పెద్ద కుంకం బొట్టూ లూజు కాకీ నిక్కరూ అంటే పోలీసోళ్ళ నిక్కరు లాంటిది, గళ్ళ గళ్ళ డబ్బా చొక్కా వేసుకుని వీధుల్లోంచి గోపాళం వస్తుంటే గచ్చు అరుగుల మీద ఆడుకుంటున్న చంటిపిల్లల్ని లోపలికి తీసుకెళ్ళిపోయేవారు ఆడోళ్ళు.

కొన్నాళ్ళకి అతని మీద చాలా కథలు పుట్టినియ్యి. అన్నీ భయపెట్టే కథలే.

* * *

దత్తుడు గారమ్మాయి లచ్చక్కకి బలభద్రపురం సంబంధం చేసి అల్లుడ్ని ఇల్లరికం తెచ్చేసుకున్నారు.

అతని పేరు తమ్మిరెడ్డి, సన్నగా రివట్లాగుండే ఆ కుర్రోడు వూరంతా చాలా చెలాగ్గా కెల తిరిగేస్తున్నాడు. మండపేటా, రామచంద్రపురం రెండో ఆట సినిమాలకెళ్ళిపోయి అర్ధరాత్రెప్పుడో తిరిగొస్తున్నాడు.

పట్టాభిరామయ్యగారి చిన్నా, రాంపురం విజయలక్ష్మి నర్సిహోంలో కాంపౌండరు బెన్నిబాబూ, మిషనుకుట్టు త్యాగరాజూ, మంచి ఫ్రెండ్సయ్యేరు తమ్మిరెడ్డికి.

ఊళ్ళోకి ఆటగట్టడానికి వచ్చే దొమ్మరోళ్ళ పిల్ల బేబీ వారం రోజుల్నుంచి చాలా ఏడిపిస్తంది వీళ్ళని. నవ్వుల్తోనూ, చూపుల్తోనూ చంపేస్తా చలీజ్వరం తెప్పిస్తుంది బేబీ.

ఆవేళ రాత్రి తూరుపుగాలి ఝుయ్యిఝుయ్యిమంటా వీస్తుంది. ఎగువకి ప్రయాణం చేస్తున్న గూటిపడవ పుంతరేవు ఒడ్డున కట్టేసి ఉంది. కాలవగట్టు కింద మకాం ఉంటున్న ఆ దొమ్మరోళ్ళ బేబీ వాళ్ళ జనం మధ్యలో పడుకుని నిద్రోతుంటే వెళ్ళిపోయి దాన్ని భుజానేసు కెళ్ళి పోయి చెల్లూరురూట్లో ఉన్న చింతావారి దూళ్ళ సావిట్లో పారేసేడు తమ్మిరెడ్డి.

బేబీ తాలూకు పెద్దోళ్ళు తగువు పంచాయితీ ఆఫీసు దగ్గరకి తీసుకొస్తే ప్రెసిడెంటుతో చాలా ధైర్యంగా మాటాడేడు తమ్మిరెడ్డి. మామానాన మేం పోతుంటే అది చేసిన కొంటి పనులన్నీ చూసి ఎలాగూరుకోమంటారండీ అంటా ధైర్యంగా ఎదురు తిరిగేడు.

ఊళ్ళో కాయిదా వ్యాపారం చేసే కుర్రపార్టీకీ నదురుబాద (ఆ వూరి పేరు) జనానికీ గొడవైంది. ఆ కొత్తకొంపలు జనం కర్రలూ కత్తుల్తో వూళ్ళోకి దిగితే తొడగొట్టిన తమ్మిరెడ్డి రండ్రా చూసుకుందారంటే చూసుకుందారి అంటా నేల మీదొదిలిన తారా జువ్వలాగ దూసుకుంటా వచ్చేసేడు.

పుల్లారెడ్డిని ఎవరో చంపేసి చింతాలమ్మ గుళ్ళో పారేస్తే ఆ విషయం రామచంద్రపురం స్టేషనుకెళ్ళి ఎవరో చెపితే జీపుల మీద దిగిపోయిన పోలీసులు అమ్మోరి గుడిచుట్టూ మూగిపోయేరు. పురుగుని కూడా గుళ్ళోకి రానియ్యడం లేదు.

నా కొడుకు శవాన్నోసారి చూసుకోవాలని జనం మధ్యలో ఏడుస్తున్న పుల్లారెడ్డి తల్లిని ఎవరూ పట్టించుకోడం లేదు. అది జూసిన తమ్మిరెడ్డి ఆ ముసల్దాన్ని రెక్క పట్టుకుని అడ్డొచ్చిన పోలీసుల్తో చాలా గొడవ పడి మరీ ఆముసల్దాన్ని గుళ్ళోకి తీసుకెళ్లిపోయేడు.

ఇక ఇక్కడ్నించి ధైర్యవంతుడంటే దత్తుడుగారి అల్లుడు తమ్మిరెడ్డే అనేసి చెప్పుకోడం మొదలెట్టేడు జనం.

* * *

ఆవేళ శ్రీరామనవమి.

సందకాడే వేడి వేడి అన్నాలు తినేసిన ఊరి జనం చీకటి పడేవేళకి రాములోరి గుడి ముందరేసిన పందిట్లోకి రావడం మొదలెట్టేరు. కొంతమంది కూర్చోడానికి ముక్కాలిపీటలూ, ఈత చాపలూ తెచ్చుకుంటుంటే చింతా అప్పయ్యపెద్దమ్మ ఏకంగా మడత మంచమే మోసుకొచ్చేసింది. పందిరంతా జనాలతో నిండిపోయేకా మొదలైంది బుర్రకథ. బాబూరావు మేష్టారి చెల్లెలు సీతా, తమ్ముడు సుబ్రమణ్యాం, బళ్ళ బుల్లెబ్బాయిగారి మనవడు జ్ఞానగురువూ చెపుతున్నారు బుర్రకథ. వాళ్ళ ముగ్గురికి పదిహేను పదిహారేళ్ళు మించి ఉండవు. ఆ చిన్న పిల్లలు చెపుతున్న కథని చాలా శ్రద్ధగా వినడం మొదలెట్టేరు జనం.

రాములోరి గుడినిజేర్చే ఉంది పంచాయితీ ఆఫీసు. దాని అరుగుమీద కూర్చుని బుర్రకథ చూస్తున్న తమ్మిరెడ్డి జనం మధ్యలోంచి ఎవరియ్యో గట్టిగా హాటలు వినిపించేసరికి తలకాయ అటుపక్కకి తిప్పేడు.

భూతాలగోపాళం పెద్దగొంతెట్టుకుని సీలేరులో కాంట్రాక్టులు జేసే కర్రి ఆదినారాయణరెడ్డితో మాటాడ్తా వస్తున్నాడు.

దగ్గరకొచ్చిన గోపాళానికి తమ్మిరెడ్డిని చూపించిన పొట్టిసుబ్బిరెడ్డిగారి సత్యం ''ఇతనే గోపాళం మాయ్యా దత్తుడిగారి అల్లుడంటే'' అన్నాడు.

బాగా దగ్గరకొచ్చిన భూతాలగోపాళం ''అంతా తెగ జెప్పుకుంటున్నారు నీకు చాలా ధైర్యమంటగదా అబ్బాయ్?'' అన్నాడు.

నవ్వేసేడు తమ్మిరెడ్డి.

''మనిద్దరం చిన్న పందెమేసుకుందామా?'' అన్నాడు భూతాలగోపాళం.

''ఏంట్టో అన్నాడు తమ్మిరెడ్డి.

అసలే పెద్దవయిన తన ఎఱ్ఱజీరలకళ్ళని ఇంకా పెద్దయ్యి జేసిన గోపాళం ''అమావాస్య రోజున అర్ధరాత్రప్పుడు వెంకారెడ్డిగారి సమాధి పక్కనే ఉన్న జిల్లేడు చెట్టు మొదట్లో తవ్వి దాని వేళ్ళు పీక్కుని వచ్చి చెల్లూరువంతెన మీద కూర్చునుంటాను. ఆటిని పట్టుకొచ్చి నాకివ్వాలి'' అన్నాడు.

''వోస్... అదెంతపనీ... అవునూ ఆవేళ్ళని అంత రాత్రప్పుడు ఏం జేసుకుంటావ్?'' అనడిగేడు తమ్మిరెడ్డి.

అదోలాగ నవ్విన భూతాలగోపాళం ''ఏం జేసుకుంటానో నువ్వు తిరిగొచ్చేకా చెపుతాను'' అన్నాడు.

''సరే'' అంటే ''సరే'' అనుకున్నారు.

''ఆ భూతాలగోపాళంతో పెట్టుకోడం మంచిదిగాదు...ఆడు చేలా తేడామనిషి, ఆ మధ్య తూరుప్పేటలో ఒక ఆడమనిషి సవరం రుబ్బురోలు మీదేసి స్నానం చేస్తుంటే గోపాళం ఆ సవరం లోపల తాయెత్తు కట్టి వంతెన మీద కెళ్ళి కూర్చుంటే సవరంతో జడేసుకున్న ఆ మనిషి సరాసరి అక్కడి కొచ్చేసిందంట ఆ మనిషి'' అన్నాడు పట్టాభిరామయ్యగారి చిన్నా.

''ఈడు అర్ధరాత్రి స్మశానంలో కెళ్ళి కప్పెట్టిన చంటి పిల్లల తలకాయలు తింటాడంట'' అన్నాడు మిషనుకుట్టు త్యాగరాజు.

''ఆడు మన మీద కొదిలే దెయ్యాన్ని వెనక్కి రమ్మన్నా రాదట'' అన్నాడు కాంపౌండరు బెన్నిబాబుగాడు.

''అమావాస్యరోజున వూరి చివర జమ్మిచెట్టు మీద జుట్టు విరబోసుకుని మొండి మొలతో కూర్చునుంటాడంట'' అన్నాడు కిరాణాకొట్టు సూర్యం.

వాళ్ళందరి మాటలూ విన్న తమ్మిరెడ్డి పది పరకాళా తాన్లు ఫర్రుమని చింపినట్టు నవ్వేసి వెళ్ళిపోయేడు.

* * *

ఆవేళ అమావాస్య. గ్లాస్కోలాల్చీ పంచె వేసుకున్న తమ్మిరెడ్డి పంచని లుంగీ కింద చుట్టుకున్నాడు. చంకల దగ్గర సెంటు రాసుకుని భూతాలగోపాళం దగ్గరకొచ్చి ''మరి నేను బయలుదేరొచ్చా?'' అన్నాడు.

భయంగా తమ్మిరెడ్డి కళ్ళల్లోకి చూసిన గోపాళం ''అయితే నిజంగా బయల్దేరతావా?'' అన్నాడు.

''బయల్దేరెళ్ళి ఆవేర్లేవో పీక్కొచ్చి నీకివ్వడం గదా మన ఒప్పందం?'' అన్నాడు తమ్మిరెడ్డి.

'నేనో మంత్రం చెపుతాను. అది పఠిస్తా వెళితే క్షుద్రదేవత నీ కళ్ళకి కనపడద్ది. నక్కలూ కుక్కలూ ఇంకా రకరకాల జంతువులు నీ మీదకి దూకుతాయి భయపడవు గందా?'' అన్నాడు.

''ఏంటెహె ఎదవ గోల?'' విసుక్కున్నాడు తమ్మిరెడ్డి.

''క్షుద్రశక్తి ఒక బాలాకుమారిలాగ కనపడ్తది. ఆమెనో తల్లిగా చూడాలి తప్పిస్తే ఇంకోరకంగా గానీ చూస్తే రక్తం గక్కుకుని అక్కడికక్కడే చచ్చిపోతావ్?''

''పోతే పీడ వదులుద్దిగానీ పొద్దున్నే పనుంది ఇక బయల్దేరనా?'' అనేసరికి అదోలా నవ్విన భూతాలగోపాళం ''వద్దురా'' అంటున్నా వినకుండా క్షుద్రశక్తుల గురించి వాటి మహిమల గురించి చాలా చెప్పి చిన్న గునపం హరికెన్‌లాంతరూ తమ్మిరెడ్డి చేతికిచ్చేడు.

* * *

తూరుప్పేట దాటి ఎర్రకంకర బాటమ్మట ముందుకెళ్ళిన తమ్మిరెడ్డికి ఎడం పక్క తగిలిన చాకలి చెరువుతో ఇక వూరు ఆఖరయ్యింది.

జన మెవ్వరూ లేరు. ఇంకొంచెం ముందుకెళ్ళిన తమ్మిరెడ్డికి రేకులషెడ్డు కనిపించింది. శవాన్ని పండించడానికి తీసుకొచ్చినప్పుడు వర్షంగానీ వస్తే తగ్గేదాకా ఆ షెడ్డుకింద చీడీ మీద ఉంచుతారు.

సినారేకుల షెడ్డు దాటుకుని స్మశానంలోకొస్తుంటే కటిక నిశ్శబ్దం. వెళ్తున్న తమ్మిరెడ్డి అరికాల్లో కస్సుక్కున దిగిందేదో. ఆగి గడ్డిలో చతికిలబడి లాంతరు వెలుగులో చూసుకుంటే అది చంటిబిడ్డ వేలి ఎముక, దాన్ని బయటికి లాగి లేచి కుంటుతా నడవడం మొదలెట్టేడు. గుమ్మటాల్లాగున్న ఈతచెట్ల వెనకనించి నక్కల అరుపులూ, కీచురాళ్ళ చప్పుళ్ళతో నిండిపోయింది వాతావరణం.

నెమ్మదిగా ఆ చీకట్లో లాంతరు సాయంతో ఆ గోపాళం చెప్పిన చోటు వెతుక్కుంటా పోతుంటే చాలా సేపటికి స్మశానానికి కొంచెం దూరంగా వెంకారెడ్డిగారి సమాధిని జేర్చి ఉన్న జిల్లేడు చెట్టు కనిపించింది. చాలా ఏపుగా పెరిగున్న ఆ చెట్టు మొదట్లో చేతిలో ఉన్న చిన్న గునపంతో మోచెయ్యి లోతు తవ్వి పచ్చిమట్టి అంటుకు పోయి తెల తెల్లగా కనిపిస్తున్న ఆ జిల్లేడు వేళ్ళని పీకి లాల్చీ జేబులో వేసుకుని ఒంటరిగా నడుచుకుంటా వస్తున్నాడేమో నక్కల అరుపులు పెరిగినియ్యి. పెరగడమేగాకండా నక్కలు దగ్గర కొచ్చేస్తున్నట్టు వాటి మట్టికాళ్ళ చప్పుళ్ళు చెవులకి దగ్గరగా వినిపిస్తున్నాయి..నడుచుకుంటా ముందుకెళ్తున్న తనకి పది నక్కలపైనే దగ్గర కొస్తున్నట్టనిపిస్తుంది. ''ఆ నక్కలు లగేత్తు కొచ్చి నా మీద పడితే నేను వాటితో పోరాడగలనా'' అనుకుంటా ముందుకి నడుస్తున్న తమ్మిరెడ్డి. పక్కనే ఏదో వదిలిన చప్పుడైంది. ఏంటంటే- ఎండిపోయిన ఆకులమీద తొండ మిడతని పట్టుకోడానికి పరుగెత్తుకుంటూ వెళ్తుంది. ఆగి వెనక్కి చూడకండా ఉండిపోయిన తమ్మిరెడ్డికి గోపాళం మాటలు గుర్తుకొస్తున్నాయి. క్షుద్రదేవత దగ్గరకొస్తున్న చప్పుడొచ్చి తర్వాత ఆశక్తి బాలాకుమారిగా కనపడద్ది. ఝామ్మంటా గాలి వెయ్యడంతో చేతిలో లాంతరు ఆరిపోయింది.

ఓ పక్కనించి నక్కల అరుపులు చిరుచెమట్లు పట్టినియ్యి తమ్మిరెడ్డికి.

''ఆ క్షుద్రశక్తితో పాటు ఈ నక్కలూ జంతువులూ నిన్ను వెంటాడుతుంటాయి''.

తమ్మిరెడ్డి నడకలో స్పీడు పెరిగింది. శరీరంలో వణుకూ పెరిగింది.

పరుగులాంటి నడక.

ఎంత నడిచినా తెమలడం లేదు.

''నువ్వెంత పరుగెట్టినా ఆ క్షుద్రదేవతలు నీ కంటే ముందుంటాయి''.

స్పీడు గాదు. ఇప్పుడు గేలాపే.

''ఎంతెల్ళినా మానవాతీత శక్తులు మనకంటే ముందే గదా?''

పుట్టి బుద్దెరిగాక ఎప్పుడూలేంది తమ్మిరెడ్డి శరీరమంతా చెమట్లు. గుండెల్నిండా పేద్ద బరువు గొంతుకలోంచి ఒకటే గస. అదేంటో జన్మలో భయం అంటే ఎరగని తమ్మిరెడ్డిలో మొట్ట మొదటిసారిగా భయం మొదలైంది.

భూతాలగోపాళం ఎర్రటి జీరలున్న కళ్ళతో తన కళ్ళలోకి చూస్తా మాటాడిన ప్రతిమాటా గుర్తుకొస్తుంది. గోరంతది కొండంతదిలాగ కనిపిస్తుంది. పోను పోను ఆ మాటలన్నీ స్మశానమంతా వినిపిస్తున్నట్టని పిస్తుంది. ఒక పక్క ఎండుటాకుల మీద చప్పుళ్ళు. దగ్గరయిపోతున్న నక్కల అరుపులు గొంతు తడారిపోతుంది. ఎగశ్వాస.

అగులు గుద్దుకుంటా, పరుగెడ్తున్న అతను నేలమీద పడిపోతా లేస్తున్న తమ్మిరెడ్డి కాళ్ళాడ్తున్నాయిగానీ ముందుకి పరుగెట్టలేకపోతున్నాడు.

లేచిపోయి మొత్తానికెలాగో పరుగెడ్తున్న అతని చెవులకి స్సర్రుమన్న చప్పుడు వినిపించింది.

వెనక నించి తన పంచ పట్టుకుని ఎవరో గట్టిగా లాగుతున్నారు. గింజుకుని ముందు కెళ్ళబోతుంటే ఉడుం పట్టు పట్టినట్టు లాగుతున్నారు. వెనక్కి తిరిగి చూడకూడదంట. నిజంగానే చూడలేకపోతున్నాడు. మెడకాయ తిప్పలేకపోతున్నాడు. చెమటల్తో తడిసి ముద్దయిపోతున్నాడు. బట్టల్లోనే విరోచనమైపోతుంది. అరవాలని ప్రయత్నం చేస్తున్నాడుగానీ ఎండిపోయిన గొంతు పెగలడంలేదు. అలాగ కొంచెంసేపు గడిచింది. చాలా సేపట్నుంచి చాలా అవస్థపడతా చాలా స్పీడుగా కొట్టుకుంటున్న అతగాడి పీల గుండెకాయ ఆగిపోయింది.

పొద్దుట పక్కనే ఉన్న చాకలి చెరువులోబట్టలు ఉతికి ఆరేసుకోడానికొచ్చిన జనం చూసేటప్పటికి ———

గ్లాస్కోపంచె కొన స్మశానంలో ఉన్న ఇనపకంచెకి గట్టిగా ఇరుక్కుపోయుంది. దాని పక్కనే పడుంది ధైర్యవంతుడైన దత్తుడుగారల్లుడు తమ్మిరెడ్డి శవం.

* * *